# ప్రజాక్షేత్రం
PRAJA KSHETRAM
prajakshetram.in



అతి కొద్ది కాలంలోనే ఆదరణ పొందిన 'ప్రజాక్షేత్రం'
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని మండలాల వారిగా
నియోజకవర్గాల వారిగా, జిల్లాల వారిగా
రిపోర్టర్లు కావలెను
అనుభవం గలవారికి ప్రాధాన్యం ఇవ్వబడును
ప్రజాక్షేత్రం
కాల్ : 9177920459



సంపుటి - 01 | సంచిక - 288 | హైదరాబాద్ | గురువారం | 09- 01 -2025 | పేజీలు - 6 | వెల.4/-


# చంద్రబాబు లక్ష్యాలకు అండగా ఉంటా



- భుజంభుజం కలిపి అభివృద్ధి కోసం నడుస్తా
- ప్రజల ఆశలు,ఆశయాల సాధనకు మద్దతు ఇస్తా
- రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- 2047 నాటికి 2.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం
- విశాఖపట్టణం బహిరంగ సభలో ప్రధాని మోడీ వెల్లడి
- రూ.రెండు లక్షల కోట్లకు పైగా ప్రాజెక్టులకు శ్రీకారం
- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోడీ

2 లో

# వారంపాటు ఢిల్లీ విమానాశ్రయం మూత

- రోజూ గంటన్నరపాటు అంతరాయం
- రిపబ్లిక్ డే రిహార్సల్స్ సందర్భంగా నిర్ణయం



న్యూఢిల్లీ,జనవరి8 ప్రజాక్షేత్రం:

ఢిల్లీ ఎయిర్ పోర్టు వారం రోజుల పాటు మూత పడనుంది. ప్రతిరోజు గంటన్నరకు పైగా ఎయిర్ పోర్టు రన్ వే మూతపడనుండటంతో ప్రయాణికులకు ఎయిర్ పోర్టు అథారిటీ కీలక సూచనలు చేసింది. జనవరి 19 నుంచి 26 వరకు ఢిల్లీ ఎయిర్ పోర్టు రన్ వే రోజూ 145 నిమిషాలు మూతపడనుందని అధికారులు ప్రకటన విడుదల చేశారు. ఈ వారం రోజులు ఉదయం 10.20 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు రిపబ్లిక్ సెలబ్రేషన్స్ లో భాగంగా మూసివేయ నున్నారు. ప్రతిరోజూ ఈ సమయంలో డ్రిల్స్, డ్రెస్ రిహార్సల్స్, రిపబ్లిక్ డే పరేడ్ తదితర కార్యక్రమాలు ఉండనున్నాయి. రిపబ్లిక్ డే వేడుకల కోసం భద్రతా కారణాల దృష్ట్యా నోటామ్ ఢిల్లీ విమానాశ్రయం రన్‌వే జనవరి 19 నుంచి జనవరి 26 వరకు ప్రతిరోజూ 145 నిమిషాల మిగతా 2లో..

# అస్సాం బొగ్గుగనిలో చిక్కుకున్న 15 మంది కార్మికులు

- గని నుంచి ఒకరి మృతదేహం వెలికితీత



న్యూఢిల్లీ,ప్రజాక్షేత్రం:

అస్సాంలోని డిమా హసావోలోని బొగ్గు గని నుంచి ఓ మృతదేహాన్ని వెలికి తీశారు. రెండు రోజుల క్రితం ఆ గనిలోకి నీరు ప్రవేశించింది. దీంతో దాంట్లో సుమారు 15 మంది కార్మికులు చిక్కుకున్నట్లు మిగతా 2లో..

## కేటీఆర్‌కు హైకోర్టులో మరోమారు చుక్కెదురు

- లాయర్‌తో విచారణ కుదరదన్న ధర్మాసనం
- కనుచూపు మేరలో లాయర్ ఉండేలా అనుమతి
- ఎసిబి విచారణకు సహకరించాలని సూచన
- మరోవైపు ఫార్ములా ఈ కార్ రేసు కేసు ఏసీబీ దూకుడు
- నిధుల విడుదలపై అరవింద్ కుమార్‌కు ప్రశ్నలు
- ఈడి విచారణలో హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎన్ఎల్‌రెడ్డి






హైదరాబాద్,ప్రజాక్షేత్రం:

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురయ్యింది. ఎసిబి విచారణలో లాయర్‌ను అనుమతించేది లేదని స్పష్టం చేసింది. అయితే లాయర్ కనుచూపు మేరలో ఉండేలా మాత్రం హైకోర్టు అనుమతించింది. కేటీఆర్ వేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై బుధవారం మధ్యాహ్నం 4 గంటలకు ధర్మాసనం విచారణ చేపట్టింది. ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసు విచారణలో తనతోపాటు న్యాయవాది ఉండాలంటూ కేటీఆర్ కోరడాన్ని కోర్టు ఆక్షేపించింది. కేటీఆర్‌తోపాటు లాయర్ ఉండేందుకు హైకోర్టు నిరాకరించింది. విచారణ సమయంలో లాయర్‌తో కలిసి కూర్చునే అవకాశం లేదని తేల్చి చెప్పింది. సీసీ టీవీ మిగతా 2లో...

# రూ.2,600 కోట్లతో గ్రామీణ రహదారుల నిర్మాణం

- ప్రతి ఊరు నుంచి మండలం వరకు ఏర్పాటు
- సిఎం ఆదేశాలతో అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష

హైదరాబాద్,జనవరి8ప్రజాక్షేత్రం:

రాష్ట్రంలో రూ.2,600 కోట్లతో గ్రామీణ రహదారుల నిర్మాణం చేపడుతున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ అనసూయ సీతక్క తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి ఆవాసం నుంచి గ్రామపంచాయతీ, అక్కడ నుంచి మండలానికి, జిల్లా కేంద్రానికి రహదారులు నిర్మిస్తున్నామని చెప్పారు. సరైన రహదారి సౌకర్యాలు లేక పోవడమే పల్లెల వెనకబాటుకి కారణమని ప్రభుత్వం పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణాన్ని మిగతా 2లో..



## అమెరికాలో మరోమారు కార్చిచ్చు

- లాస్ ఏంజిల్స్‌లో వేల ఎకరాలు దగ్ధం
- సురక్షిత ప్రాంతాలకు 30వేలమంది తరలింపు

న్యూయార్క్,జనవరి8ప్రజాక్షేత్రం:

అమెరికాలో కుబేరులకు ఆవాసాలైన మూడు నగరాల్లో లాస్ ఏంజెలెస్ ఒకటి. ఇప్పుడు ఆ సిటీలోని అత్యంత ఖరీదైన ప్రదేశాన్ని కార్చిచ్చు చుట్టుముట్టింది. దీంతో వేలాది ఎకరాల్లోని విలాసవంతమైన ఇళ్లు అగ్నికి ఆహుతి



అవుతున్నాయి. ఇక్కడ సంపన్నవర్గాలు నివసించే ది పాలిసాడ్స్ ప్రాంతంలో కార్చిచ్చు చెలరేగింది. దాదాపు 3000 ఎకరాలు దగ్ధమయ్యాయి. దీంతో 30,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. చాలామంది తమ సామగ్రి, వాహనాలను మిగతా 2లో..

### గ్రూప్-3 ప్రిలిమనరీకీ

## విడుదల

- 12 వరకు అభ్యంతరాల స్వీకరణ
- మే 1 నుంచి కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు
- టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం వెల్లడి



హైదరాబాద్,జనవరి8ప్రజాక్షేత్రం:

రాష్ట్రంలో 1,365 ఉద్యోగ ఖాళీలకు నిర్వహించిన గ్రూప్ -3 పరీక్ష మిగతా 2లో..

### మహాకుంభమేళాకు దేశవిదేశాల నుంచి

## 40 కోట్ల మంది

- రైల్వేశాఖ పెద్ద ఎత్తున ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు



న్యూఢిల్లీ,జనవరి8ప్రజాక్షేత్రం:

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో ఈ నెల 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరుగనున్న జరుగనున్న మహా కుంభమేళాకు దేశవిదేశాల నుంచి 40 కోట్ల మంది వరకు వస్తారని అంచనా వేస్తున్నారు. యాత్రికులు, భక్తులను చేరవేసేందుకు రైల్వే శాఖ మిగతా 2లో..

ప్రజాక్షేత్రం
PRAJA KSHETRAM
గురువారం 09 జనవరి 2025

# చంద్రబాబు లక్ష్యాలకు అండగా ఉంటా

**విశాఖపట్నం,జనవరి8(ప్రజాక్షేత్రం:**

ముఖ్యమంత్రి చంద్రబాబు పెట్టుకున్న లక్ష్యాలకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రజల ఆశలు, ఆశయాల సాధనకు మద్దతుగా నిలుస్తామని మోదీ హామీ ఇచ్చారు.ఏపీలో రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా విశాఖ ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 'ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రేమ, అభిమానానికి కృతజ్ఞతలు. మీ ఆశీర్వాదంతో 60 ఏళ్ల తర్వాత తొలిసారి మేం మూడోసారి అధికారంలోకి వచ్చాం. రాష్ట్రానికి అన్ని రంగాల్లో మద్దతుగా నిలుస్తున్నాం. 2047 నాటికి 2.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ రాష్ట్రంతో భుజం భుజం కలిపి నడుస్తాం. ఇవాళ తలపెట్టిన ప్రాజెక్టులు రాష్ట్ర వికాసానికి తోడ్పడతాయని మోడీ అన్నారు ఐటీ, టెక్నాలజీకి ఆంధ్రప్రదేశ్ ప్రధాన కేంద్రం కానుంది. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధిని సరికొత్త శిఖరాలకు చేరుస్తాయి. 2030లోగా 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి మా లక్ష్యం. దేశంలో 2 గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు వస్తుంటే.. దానిలో ఒకటి విశాఖకు కేటాయించాం. గ్రీన్ హైడ్రోజన్ హబ్ ద్వారా ఎంతో మందికి ఉపాధి లభిస్తుందని భరోసా ఇచ్చారు.'నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కుకు శంకుస్థాపన చేశాం. కేవలం 3 రాష్ట్రాల్లోనే ఇలాంటి పార్కులు వస్తున్నాయి. చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో క్రిస్ సిటీ భాగం అవుతుంది. ఇప్పటికే శ్రీసిటీ ద్వారా ఏపీలో తయారీరంగం ఊపందుకుంది. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు పునాదిరాయి వేశాం. రాష్ట్ర అభివృద్ధిలో రైల్వే జోన్ కీలకం కానుంది. రైల్వే జోన్ ద్వారా రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుంది. రైల్వే జోన్ వల్ల వ్యవసాయ, పర్యాటక రంగాలు ఊపందుకుంటాయి. రాష్ట్రంలో ఇప్పటికే 7 వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. అమృత్ భారత్ కింద ఏపీలోని 70కి పైగా రైల్వేస్టేషన్లు ఆధునికీకరణ చేపట్టాం' అని ప్రధాని మోడీ వివరించారు. మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. ఈ క్రమంలో నేడు విశాఖపట్నంలో రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మాట్లాడిన ప్రధాని తన అభిమానాన్ని చూపించే అవకాశం ఇప్పుడు వచ్చిందని పేర్కొన్నారు. తెలుగులో ప్రసంగం మొదలు పెట్టిన ప్రధాని మోదీ.. ఆంధ్ర ప్రజల ప్రేమ, అభిమానానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఐదేళ్ల తర్వాత ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. చంద్రబాబు స్పీచ్‌తో సిక్సర్ కొట్టారని పేర్కొన్నారు. 60 ఏళ్ల తర్వాత దేశంలో మూడోసారి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని మోదీ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో చంద్రబాబు లక్ష్యాలకు మేం ఎప్పుడూ అండగా ఉంటామని ప్రధాని అన్నారు. ఏపీ ప్రజల ఆశలు, ఆశయాలకు మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ఏపీకి అన్ని రంగాల్లో మద్దతుగా నిలుస్తున్నామని, ఏపీతో భుజం భుజం కలిపి నడుస్తామని మోదీ పేర్కొన్నారు. ఇవాళ తలపెట్టిన ప్రాజెక్టులు రాష్ట్ర వికాసానికి తోడ్పడతాయని ప్రధాని వెల్లడించారు. దీంతోపాటు ఐటీ, టెక్నాలజీకి ఏపీ ప్రధాన కేంద్రం కానుందని ప్రధాని మోదీ అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఈ ప్రాజెక్టులు ఏపీ అభివృద్ధిని సరికొత్త శిఖరాలకు చేరుస్తాయని ప్రధాని మోదీ అన్నారు. 2030లోగా 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయడమే మా లక్ష్యమని ప్రధాని తెలిపారు. నవయుగ పట్టణీకరణకు ఏపీ సాక్ష్యంగా మారబోతోందని ఈ సందర్భంగా మోదీ చెప్పారు. విశాఖ ప్రత్యేక రైల్వే జోన్ డిమాండ్ చాలా కాలంగా ఉందని, చిరకాల కోరిక ఈరోజు నెరవేరిందన్నారు. రైల్వే జోన్ రాకతో వ్యవసాయంతోపాటు అనేక వ్యాపారాలు కూడా అభివృద్ధి చెందుతాయన్నారు. ఏపీ అభివృద్ధి మా విజన్ అని మరోసారి గుర్తు చేశారు ప్రధాని మోదీ.'దేశంలో రెండు గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు వస్తుంటే.. అందులో ఒకటి విశాఖకు కేటాయించాం. గ్రీన్ హైడ్రోజన్ హబ్ ద్వారా ఎంతోమందికి ఉపాధి లభిస్తుంది. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్‌కు శంకుస్థాపన చేశాం. 3 రాష్ట్రాల్లోనే ఇలాంటి బల్క్ డ్రగ్ పార్కులు వస్తున్నాయి. చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో క్రిస్ సిటీ భాగం అవుతుంది. ఇప్పటికే శ్రీసిటీ ద్వారా ఏపీలో తయారీరంగం ఊపందుకుంది. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు పునాదిరాయి వేశాం. రాష్ట్ర అభివృద్ధిలో రైల్వే జోన్ కీలకం కానుంది. రైల్వే జోన్ ద్వారా రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుంది. రైల్వేజోన్ వల్ల వ్యవసాయ, పర్యాటక రంగాలు ఊపందు కుంటాయని ప్రధాని మోదీ అన్నారు. ప్రధాని మోడీ అంతకుముందు విశాఖలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. దీనికి భారీగా జనం హాజరై మోడీకి అభివాదం తెలిపారు. బహిరంగ సభలో ప్రధాన ప్రసంగాన్ని తెలుగులో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అనువాదం చేసి అందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం విశాఖ పర్యటనలో భాగంగా అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ను మరో ఎత్తుకు చేర్చుతూ రూ.రెండు లక్షల కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు.. విశాఖ సభలో వర్చువల్‌గా వీటిని ప్రధాని మోడీ ప్రారంభించారు. ఇందులో అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడకలో ఏర్పాటుచేసే గ్రీన్ హైడ్రోజన్ హబ్ విలువే రూ.1.85లక్షల కోట్లు. రహదారులు, రైల్వే పనుల అంచనా రూ.19.5 వేల కోట్లు. వీటితోపాటు మరో 10కి పైగా ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేసారు. అలాగే.. కొత్తగా నిర్మించిన, విస్తరించిన ఆరు రహదారులు, రైల్వే లైన్లు జాతికి అంకితం చేసారు. ప్రధాని మోదీ విశాఖ సభా వేదికగా 12కు పైగా ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ఆరుకు పైగా రహదారులను జాతికి అంకితం చేసే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ పనుల విలువ దాదాపు రూ. రెండు లక్షల కోట్ల పైమాటే. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడకలో ఎన్‌టీపీసీ రూ.1.85 లక్షల కోట్లతో గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఏర్పాటు. 57 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ ప్రాజెక్టును 1,600 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కుకు శంకుస్థాపన, కృష్ణపట్నానికి సంబంధించిన ఇండస్ట్రియల్ నోడ్, విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన.,ఆదోని పట్టణం నుంచి ఎన్‌హెచ్-167ను కలుపుతూ బైపాస్ రహదారి, కొండమోరు నుంచి పేరేచర్ల రహదారి విస్తరణ, సంగమేశ్వరం నుంచి ఆత్మకూరు వరకు రహదారి విస్తరణ, వేంపల్లి నుంచి చాగలమర్రి వరకు ఎన్‌హెచ్-440 నాలుగు లేన్లకు విస్తరణ,ఎన్‌హెచ్-516 నుంచి పాడేరు బైపాస్ రహదారి నిర్మాణం,గుంటూరు నుంచి బీబీ నగర్ వరకు రైల్వే లైన్ డబ్లింగ్,మహబూబ్ నగర్ నుంచి కర్నూల్ మీదుగా డోన్ రైల్వే లైన్ డబ్లింగ్,గుత్తి-పెండేకల్లు రైల్వే లైన్ డబ్లింగ్, రూ.19,500 కోట్ల విలువైన రహదారులు, రైల్వే ప్రాజెక్టులు.. ఇంకా ఇతర ప్రాజెక్టులకు శంకుస్థాప న చేసారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఆయన రాష్ట్రాని రావడం ఇదే మొదటిసారి. ప్రధాని వెంట ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా ఈ పర్యటనలో పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 1.5 లక్షల మందిని సమీకరించారు. సభ వేదికపై మోదీతో పాటు గవర్నర్ అబ్దుల్ నజీర్, చంద్రబాబు, పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, సత్యకుమార్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీని వాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యుడు సుందరపు విజయకుమార్ ఉన్నారు. ప్రధానికి కుడి వైపున గవర్నర్, ఎడమ వైపున ముఖ్యమంత్రికి సీట్లు కేటాయించారు. పవన్‌కల్యాణ్, చంద్రబాబు ప్రసంగించిన తరు వాత ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల శిలాఫలకాలు ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించారు. ప్రధాని ప్రసంగాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు అనువదించారు.

## వారంపాటు ఢిల్లీ విమానాశ్రయం మూత

మెదటిపేజీ తరువాయి

పాటు మూసివేయబడుతుంది. ఉదయం 10:20 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు రిహార్సల్స్, రిపబ్లిక్ డే పరేడ్ సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ వారం రోజులపాటు మధ్యాహ్నం వరకు ఢిల్లీ ఎయిర్ పోర్ట్ రన్‌వే మూసివేస్తే 1,300 కంటే ఎక్కువ విమానాలకు అంతరాయం కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో విమానయాన పరిశోధన సంస్థ సిరియమ్ ప్రకారం 1,336 విమానాలపై ఈ ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. వాటిలో 665 బయలుదేరేవి కాగా, 671 రాకపోకలు సాగించేవన్నారు. దీంతోపాటు టొరంటో, వాషింగ్టన్, తాష్కెంట్, కొలంబో వంటి గమ్యస్థానాలకు వెళ్లే అంతర్జాతీయ విమానాలు కూడా ప్రభావితమయ్యాయి. ఈ క్రమంలో కొన్ని విమానాలు పూర్తిగా రద్దు కాకుండా రీషెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉంటుంది. ఇటీవల ఢిల్లీలో పొగమంచు గరిష్ట స్థాయికి చేరుకున్న కారణంగా వందల సంఖ్యలో విమానాలు ఆలస్యం అయిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఢిల్లీకి వచ్చే, ఢిల్లీ నుంచి బయలుదేరే ప్రయాణీకులు ప్రయాణించే ముందు విమాన మార్పుల సమాచారం గురించి తెలుసుకోవాలని సూచిస్తున్నారు. అప్‌డేట్‌ల కోసం మీ ఎయిర్‌లైన్ ఫోన్ నంబర్, ఇమెయిల్ వంటివి అందుబాటులో ఉంచుకోవాలని చెబుతున్నారు. వీలైతే పరిమిత గంటల తర్వాత విమానాలను రీబుక్ చేసుకోవాలని అంటున్నారు. రద్దు చేసిన సందర్భంలో విమానయాన సంస్థలు సాధారణంగా ప్రత్యామ్నాయ విమానాలు లేదా వాపసులను అందిస్తాయి. చివరి నిమిషంలో మళ్లీ నమోదు చేసుకోవాలి. ఈ క్రమంలో అధిక ఖర్చులకు సిద్ధంగా ఉండాలని కూడా పలు సంస్థలు చెబుతున్నాయి. విమానయాన సంస్థలు దేశవ్యాప్తంగా ఉన్న విమానాశ్రయాలతో సమన్వయం చేస్తున్నందున షెడ్యూల్ మార్పులు, విమాన రద్దు వంటి కార్యకలాపాల గురించి నివేదికలను పంపిస్తుంది. అయినప్పటికీ ఢిల్లీలో దాదాపు పూర్తి సామర్థ్యంతో పాటు ముంబై విమానాశ్రయంలో పరిమితుల కారణంగా విమానాల రీషెడ్యూల్ వంటి సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉంది. ఇలాంటి విషయాలను ముందుగా ప్రకటించడం వలన ఆయా విమానయాన సంస్థలు, ప్రయాణీకులు మరింత సమర్థవంతంగా ప్లాన్ చేసుకునే ఛాన్స్ ఉంటుంది. దీంతో 13 వందలకు పైగా విమానాల కు అంతరాయం కలగనుందని వెల్లడించారు. ఇందులో 665 ఢిల్లీ నుంచి వెళ్లేవి ఉండగా, 671 విమానాలు రావాల్సినవి ఉన్నాయి. ఇందులో టొరంటో, వాషింగ్టన్, తాష్కెంట్, కొలంబో తదితర అంతర్జాతీయ ÷÷-లట్ లు కూడా ఉన్నాయి. కొన్ని ÷÷-లట్లైను క్యాన్సల్ చేస్తుండగా మరికొన్నింటి టైమింగ్స్ మార్చుతున్నట్లు తెలిపారు. అయితే ఎప్పుడు రద్దీగా ఉండే రాజధాని ఢిల్లీ ఎయిర్ పోర్టులో పీక్ టైమింగ్స్ లో తీవ్ర ఇబ్బందులు కలగవచ్చునని చెబుతున్నారు.

## అస్సాం బొగ్గుగనిలో చిక్కుకున్న 15 మంది కార్మికులు

మెదటిపేజీ తరువాయి

కంపెనీ వెల్లడిం చింది. నీటితో నిండిన గనిలోకి 21 పారా డ్రైవర్లు గాలింపు కోసం వెళ్లారు. గని దిగువ భాగం నుంచి ఓ మృతదేహాన్ని తీసుకువచ్చారు. నేవీ, ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ దళాలు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. విశాఖపట్టణంకు చెందిన డైవర్లు అక్కడకు చేరుకున్నారు. ఆపరేషన్‌కు ముందు రెక్కీ నిర్వహించి ఆ తర్వాత క్వారీలోకి ఎంటరయ్యారు. గని నుంచి నీటిని తొవ్వేందుకు ఎస్డీఆర్ఎఫ్ డీవాటర్ పంపులను తీసుకువస్తోంది. కుంభీగ్రామ్ నుంచి కూడా ఎంఐ17 హెలికాప్టర్ ద్వారా ఓఎన్జీసీ వాటర్ పైపులను తీసుకువస్తున్నారు. కేంద్ర గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డితో మాట్లాడినట్లు సీఎం హిమంత బిశ్వ శర్మ తెలిపారు. కోల్ ఇండియాకు చెందిన సిబ్బంది.. రెస్క్యూ ఆపరేషన్‌కు రానున్నట్లు మంత్రి తెలిపారు. క్వారీలో నీరు వంద ఫీట్లకు చేరుకున్నది. సుమారు 340 ఫీట్ల లోతులో ఉన్న క్వారీలో కార్మికులు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. కార్మికుల పేర్లను కూడా రిలీజ్ చేశారు.అక్రమ రీతిలో గని నిర్వహిస్తున్నట్లు గుర్తించామని సీఎం హిమంత బిశ్వ శర్మ తెలిపారు. ఈ కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు చెప్పారు. ఉమ్రాంగ్సో పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎన్డీఆర్ఎఫ్ ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ హెచ్పీఎస్ ఖాన్‌దారి మాట్లాడుతూ.. నిన్న చాలాసార్లు కార్మికులను చేరుకునేందుకు ప్రయత్నించామని, కానీ తమ ప్రయత్నాలు ఫలించలేదన్నారు. జాయింట్ టీమ్ ఇవాళ గనిలోకి డైవ్‌చేసిందని, వాళ్లు ఓ బాడీని రికవరీ చేసినట్లు చెప్పారు. గనుల్లో డైవింగ్ చేయడం సులువైన అంశం కాదని, రాట్ హోల్స్ ఉన్నాయని, వాటి ఆధారంగా గాలింపు ఉంటుందని ఆయన తెలిపారు.

## మహాకుంభమేళాకు దేశవిదేశాల నుంచి 40 కోట్ల మంది

మెదటిపేజీ తరువాయి

పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. 50 రోజులపాటు 13 వేల రైళ్లు నడపాలని నిర్ణయించింది. వీటిలో పది వేలు రెగ్యులర్ సర్వీసులు కాగా.. మూడు వేలు ప్రత్యేక రైళ్లు. మేళా జరగడానికి 2-3 రోజుల ముందు.. ఆ తర్వాత 2-3 రోజుల వరకు రైళ్లు నడుస్తాయి. అలాగే పవిత్ర పుణ్యక్షేత్రాలను కలుపుతూ 560 రింగ్ రైళ్లు నడుపనుంది. ప్రయాగరాజ్- అయోధ్య- వారాణసీ-ప్రయాగ్‌రాజ్, ప్రయాగరాజ్-సంగమ్ ప్రయాగ్- జాన్‌పూర్- ప్రయాగ్- ప్రయాగరాజ్, గోవింద్‌పురి-ప్రయాగరాజ్-చిత్రకూట్-గోవింద్‌పురి, ఝాన్సీ-గోవింద్‌పురి- ప్రయాగరాజ్- మాణిక్‌పూర్- చిత్రకూట్-ఝాన్సీ మార్గాల్లో వీటిని నడుపుతారు. ప్రయాగరాజ్ ప్రాంతంలోని మొత్తం 9 రైల్వే స్టేషన్లలో 560 టికెట్ కౌంటర్లను కూడా రైల్వే ఏర్పాటుచేస్తోంది. భక్తులు లక్షలాదిగా తరలిరానున్న నేపథ్యంలో రైల్వే రక్షణ దళం (ఆర్‌పీఎఫ్), రాష్ట్ర రైల్వే పోలీసుకు చెందిన 18 వేల మందికిపైగా సిబ్బందిని మోహరిస్తున్నట్లు ఉత్తర మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు. ప్రయాణికులకు వైద్య సేవలు అందించడానికి ఆక్సిజన్ సిలిండర్లు, కాన్సంట్రేటర్లు, ఈసీజీ యంత్రాలతో ప్రయాగరాజ్ జంక్షన్‌లో అబ్జర్వేషన్ రూంను ఏర్పాటు చేశామన్నారు. కాగా మహాకుంభమేళాకు ఆదివారం బాంబు బెదిరింపు వచ్చింది. ఉగ్రదాడిచేస్తానని, వెయ్యి మందిని చంపుతానని సోషల్ మీడియాలో పోస్టుచేసిన ఆయుషకుమార్ జైస్వాల్‌ను మహాకుంభ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇతడు విద్యార్థి. బిహార్‌లోని షాదీజంగ్ వాసి. ఇన్‌స్టాగ్రాంలో నాసిర్ పఠాన్ అనే నకిలీ పేరుతో ఈ బెదిరింపు పోస్టు పెట్టి నేపాల్ పారిపోయాడు. తన పక్కింటిలోని నాసిర్ పఠాన్‌ను ఇరికించేందుకే ఆయుష్ ఆ పేరుతో పోస్టు పెట్టినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

## కేటీఆర్‌కు హైకోర్టులో మరోమారు చుక్కెదురు

మెదటిపేజీ తరువాయి

పర్యవేక్షణ లేదా కేటీఆర్ కనిపించేంత దూరంలో న్యాయవాది ఉండేందుకు అనుమతి ఇచ్చింది. ఏసీబీ అధికారులు విచారణ చేస్తున్నప్పుడు న్యాయవాది రాంచందర్‌రావు విజిబుల్ డిస్టెన్స్‌లో ఉండేందుకు హైకోర్టు అంగీకరించింది. నేరుగా కేటీఆర్ పక్కన విచారణలో పాల్గొనేందుకు నిరాకరించింది. రేపు ఏసీబీ అధికారుల ఎదుట విచారణకు హాజరుకావాలని కేటీఆర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. విచారణపై అభ్యంతరాలు ఉంటే మళ్లీ కోర్టుకు రావొచ్చని తెలిపింది. విచారణ సందర్భంగా న్యాయమూర్తికి కేటీఆర్ వెంట వెళ్లే లాయర్ పేరును న్యాయవాది ప్రభాకర్ రావు తెలిపారు. కేటీఆర్ వెంట మాజీ అడ్వకేట్ జనరల్ జే రామచంద్రరావు వెళ్తారని న్యాయమూర్తికి తెలిపారు. కేటీఆర్‌కు కనిపించే దూరంలో న్యాయవాది ఉంటారని జడ్జి చెప్పారు. కేటీఆర్‌ను ఒక గదిలో, లాయర్‌ను ఒక గదిలో కూర్చోబెట్టి.. విచారణ కనిపించేలా చర్యలు తీసుకోవాలని కోర్టు ఏఏజీకి సూచించింది. లైబ్రరీ విండో నుంచి కేటీఆర్ విచారణను చూడొచ్చని ఏఏజీ కోర్టుకు తెలిపారు. ఇక కేటీఆర్ విచారణను ఆడియో, వీడియో రికార్డు చేయాలని ఆయన తరపు న్యాయవాది కోర్టును కోరారు. ఇందుకు హైకోర్టు నిరాకరించింది. సీసీటీవీ పర్యవేక్షణలో కేటీఆర్‌ను విచారించాలని కోర్టు ఆదేశించింది.

### ఫార్ములా ఈ కార్ రేసు కేసు ఏసీబీ దూకుడు

ఫార్ములా ఈ కార్ రేసు కేసు దర్యాప్తులో ఏసీబీ దూకుడు పెంచింది. ఈ కేసులో నోటీసులు అందుకున్న అప్పటి పురపాలకశాఖ ప్రత్యేక కార్యదర్శి అరవింద్ కుమార్ బుధవాం ఉదయం ఏసీబీ విచారణకు వచ్చారు. దాదాపు మూడు గంటలుగా అరవింద్ కుమార్‌ను ఏసీబీ ప్రశ్నించింది. ముగ్గురు ఏసీబీ అధికారుల బృందం.. ఫార్ములా ఈ కార్ రేసులో నిధుల మళ్లింపుకు సంబంధించే ఏసీబీ ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు తెలుస్తోంది. రూ.55 కోట్ల నిధులను విదేశీ కంపెనీకి హెచ్‌ఎండీఏ చెల్లించిన నేపథ్యంలో ఇదే విషయంపై ఏసీబీ అధికారులు ప్రశ్నించారని సమాచారం. రూ.55 కోట్లు ఎఫ్‌ఈవో సంస్థకు చెల్లించిన నేపథ్యంలో విదేశీ కంపెనీకి నగదు బదిలీ వెనుక ఉన్న అసలు కోణం ఏంటి.. ఇది ఎవరి నిర్ణయం... నగదు బదిలీకి ఆర్బీఐ అనుమతి ఉందా అంటూ అరవింద్ కుమార్‌కు ఏసీబీ వరుస ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. అలాగే ఈ ప్రశ్నలకు అర వింద్ కుమార్ కూడా కీలక సమాచారం చెప్పినట్లు సమాచారం. కేటీఆర్ ఆదేశాలు ఇవ్వడంతోనే నగదు రిలీజ్ చేశామని అర వింద్ కుమార్ స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అరవింద్ కుమార్ చెబుతున్న స్టేట్‌మెంట్‌ను ఏసీబీ రికార్డు చేస్తోంది .55కోట్లు నిధుల విదేశీ అకౌంట్లు కు జమ చేయడం ఎవరి నిర్ణ యం..ఆర్థిక శాఖ అనుమతులు లేకుండా ఎందుకు నిధులు రిలీ జ్ చేశారు..కేబినెట్ అప్రూవల్ లేకుండా నిధులు రిలీజ్ చేయ వద్దని మీకు తెలియదా అంటూ ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలుస్తోంది. కేటీఆర్ ఆదేశాలు ఇవ్వడంతోనే నగదు రిలీజ్ చేశామని అరవింద్ కుమార్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. మంత్రిగా కేటీఆర్ ఆదేశాలు ఇచ్చినా .. ఆ రూల్స్‌ను ప్రజాప్రతినిధులకు చెప్పాల్సిన బాధ్యత ఉంది కదా రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా అనుమతి లేకుండా .. బ్యాంక్ ఎలా నగదు బదిలీ చేసింది ? హెచ్‌ఎండీఏ పరిధిని మించి నగదు బదిలీ చేసింది.. మౌఖిక ఆదేశాలు కేవలం కేటీఆర్ మాత్రమే ఇచ్చారా లేక ఇంకా ఎవరైనా ఉన్నారా ఎఫ్‌ఈవోతో చేసుకున్న అగ్రిమెంట్ ఏంటి అగ్రిమెంట్‌లో రాసుకున్న నిబంధనలు ఏంటిగ్రీన్ కో స్పాన్సర్ షిప్ నుంచి వైదొలగడానికి కారణం ఏంటి ఒప్పందం ప్రకారం 2024లో నిర్వహించాల్సిన రేస్ ఎందుకు నిర్వహించలేక పోయారు... హెచ్‌ఎండీఏ కార్ రేసింగ్ కోసం కాకుండా .. ఇంకా వేటికైనా నిధులు రిలీజ్ చేశారా హెచ్‌ఎండీఏ నిర్ణయాల్లో చైర్మన్ పాత్ర ఏమైనా ఉంటుం దా అంటూ ఇలా వరుసగా ఏసీబీ ప్రశ్నలు సంధించింది .ఓవైపు ఏసీబీ కార్యాలయంలో ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను ఏసీబీ ప్రశ్నిస్తుండగా.. మరోవైపు ఈడీ కార్యాలయంలో హెచ్ ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎన్ఎల్ రెడ్డిని ఈడీ అధికారులు విచారించారు. ప్రధానంగా ఈ కార్ రేసులో హెచ్‌ఎమ్‌డీఏ పాత్ర స్వల్పంగా ఉన్నప్పటికీ స్పాన్సర్స్ చెల్లించాల్సిన డబ్బును హెచ్‌ఎండీఏ ఎందుకు చెల్లించాల్సి వచ్చిందని బీఎన్ఎల్ రెడ్డిని ఈడీ అధికారులు ప్రశ్నించారు.

## అమెరికాలో మరోమారు కార్చిచ్చు

మెదటిపేజీ తరువాయి

అక్కడే వదిలేసి ప్రాణాలు కాపాడుకోవడానికి తరలివెళ్లారు. వీధుల్లో పొగ కమ్మేసింది. మరోవైపు ఒక్కసారిగా ప్రజ లు రోడ్ల పైకి రావడంతో చాలాచోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇక్కడ కొండలపై ఉన్న రహదారులు ఇరుగ్గా ఉంటాయి. దీనికితోడు గాలులు ఎక్కువగా వీయడంతో మంటలు తొందరగా వ్యాపిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఇక్కడ గంటకు 100 మైళ్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ స్పందిస్తూ.. 'చాలా నిర్మాణాలు కాలిపోయాయి. మరికొన్నిచోట్ల కూడా కార్చిచ్చులు పుట్టొచ్చని అగ్నిమాపక శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు' అని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 13,000 నిర్మాణాలకు కార్చిచ్చు ముప్పున్నట్లు లాస్ ఏంజెలెస్ అగ్నిమాక అధికారి క్రిస్టిన్ క్రాప్లీ చెప్పారు. బెవర్లీ హిల్స్, హాలీవుడ్ హిల్స్, మలిబు, శాన్‌ఫెర్నాండో ప్రాంతాలకు కార్చిచ్చు వ్యాపించే ప్రమాదం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ్గి ÷ర్ అలర్ట్ లెవల్స్‌ను పెంచారు. దాదాపు 62,000 మంది ప్రజలు కొన్ని గంటలుగా విద్యుత్తు లేక ఇబ్బందిపడుతున్నారు. ఇక్కడ మంటలను ఆర్పడానికి విమానాలు, హెలికాప్టర్లు, బుల్డోజర్లను అధికారులు రప్పించారు. హాలీవుడ్ స్టార్లు టామ్ హాంక్స్, రీస్ విథర్స్పూన్, స్పెన్సర్ ప్రాట్, హెడీ మోంటాగ్ వంటి నటుల ఇళ్లు అగ్నికి ఆహుతైనట్లు తెలుస్తోంది. మరికొందరి ఇళ్లు కూడాఅగ్నికీలలకు సమీపంలో ఉన్నట్లు తెలుస్తోంది. అధ్యక్షుడు జోబైడెన్ ఇక్కడి కార్చిచ్చుపై స్పందించారు. తరచూ అప్‌డేట్లు తెలుసుకొంటున్నట్లు వెల్లడించారు. అక్కడి ప్రజలకుఅవసరమైన అన్నిరకాల సాయాలను శ్వేతసౌధం చేస్తుందన్నారు. స్థానిక అధికారులతో తన బృందం టచ్‌లో ఉన్న ట్లు వెల్ల డించారు. ఇప్పటికేర్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ గ్రాంట్ ను విడు దల చేసినట్లు పేర్కొన్నారు. అక్కడి ప్రజలు అప్రమత్తంగా ఉండా లని.. స్థానిక అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

## రూ.2,600 కోట్లతో గ్రామీణ రహదారుల నిర్మాణం

మెదటిపేజీ తరువాయి

చేపడుతోందని అన్నారు. ఎర్రమంజిలోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో రూరల్ ఇంజనీర్లతో మంత్రి సీతక్క బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ కనక రత్నం, చీఫ్ ఇంజనీర్లు, సీఈలు, ఈఈలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రోడ్ల నిర్వహణ కోసం రూ.1600 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఇందుకు అనుగుణంగా రూరల్ ఇంజనీర్లు కార్యాచరణ సిద్ధం చేయాలని, కొత్త రహదారుల నిర్మాణ అంచనాలు పక్కాగా ఉండాలని సూచించారు. ఇష్టా రీతినా అంచనాలను సవరించొద్దని తెలిపారు. 30 మెట్రిక్ టన్నుల వాహనాలు నడిచేలా రోడ్ల సామర్థ్యాన్ని మెరుగుపరచాలని అన్నారు. ఇంజనీర్లే ఈ దేశ నిర్మాతలని అన్న మంత్రి మోక్షగుండం విశ్వేశ్వరయ్య, కాకతీయుల కాలం నాడు కట్టిన కట్టడాలు ఇంకా పటిష్టంగా ఉన్నాయని గుర్తు చేశారు. అదే రీతిన గ్రామీణ ప్రాంతాల్లోని ఇంజనీర్లు కట్టే నిర్మాణాలు 10 తరాలు ఉండేవిధంగా చూడాలని పేర్కొన్నారు. మహానగరాల్లో రోడ్లు మెరిసినట్టుగానే పల్లెల్లో రహదారులు మెరవాలని, ఆ బాధ్యత గ్రామీణ విభాగానికి చెందిన ఇంజినీరింగ్ అధికారులదేనని అన్నారు. పెరుగుతున్న రవాణా అవసరాలకు అనుగుణంగా రహదారుల నిర్మాణం జరగాలని అన్నారు. నాణ్యతపై రాజీ పడొద్దని, జిల్లా స్థాయిలో రూరల్ ఇంజనీర్లు ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహించాలని అన్నారు. పనుల పురోగతి నివేదికలను ప్రతి 15 రోజులకు నివేదించాలని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గుండివాగు బ్రిడ్జి 10 ఏండ్లుగా పూర్తికాలేదని, దీనివల్ల 40 మంది ప్రజలు వాగు దాటలేక మృత్యువాత పడ్డారని మంత్రి అన్నారు. గతంలో తన నియోజకవర్గంలో సరైన గ్రామీణ రోడ్లు లేక ఎంతో మంది ఆత్మీయులను రోడ్డు ప్రమాదంలో కోల్పోయానని చెప్పారు. పట్టణాల్లో ÷÷-లఓల్గ÷వర్లు, స్కై ఓవర్లు ఉన్నాయి, కానీ చాలా గ్రామాల్లో కనీస రోడ్డు సదుపాయం లేకపోవడం బాధాకరమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల పల్లెలకు రహదారి సౌకర్యం కలిగిస్తేనే అసలైన అభివృద్ధి అని పేర్కొన్నారు. ఎస్టీ వర్గానికి చెందిన తనకు పంచాయతీరాజ్ శాఖ అప్పగించారని అన్నారు. రూరల్ ఇంజనీర్లు సహకారం ఉంటే ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని అన్నారు. రోడ్డు సదుపాయం లేని ఆవాసాలు, గ్రామాలు ఉండొద్దని, ఆ లక్ష్యంతో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ భాగం పని చేయాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.

## గ్రూప్-3 ప్రిలిమనరీకీ విడుదల

మెదటిపేజీ తరువాయి

ప్రిలిమినరీ కీని టీజీ పీఎస్సీ విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 1,401 కేంద్రాల్లో గతేడాది నవంబర్ 17, 18 తేదీల్లో ఈ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. మొత్తం మూడు పేపర్లుగా నిర్వహించిన ఈ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 5.36లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. 2,69,483 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. గ్రూప్ 3 ప్రిలిమినరీ కీపై జనవరి 12 సాయంత్రం 5గంటల వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఇంగ్లిష్‌లోనే అభ్యంతరాలను తెలపాలని, అభ్యర్థులు లేవనెత్తిన అంశాలకు సంబంధించిన ఆధారాల కాపీలను ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయాలని సూచించారు. ఈ-మెయిల్, వ్యక్తిగతంగా వెళ్లి సమర్పించడాన్ని ఎట్టిపరిస్థితుల్లో అనుమతించబోమని స్పష్టంచేశారు. ఇదిలావుంటే మే 1 నుంచి కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేస్తామని టీజీపీఎస్సీ వెల్లడించింది. మార్చి 31లోగా ఉద్యోగ ఖాళీల వివరాలను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు పేర్కొంది. ఖాళీల ప్రకారం నోటిఫికేషన్ల జారీపై ఏప్రిల్‌లో కసరత్తు చేస్తామని తెలిపింది. కొత్త నోటిఫికేషన్లు ఇచ్చి 6-8 నెలల్లో భర్తీ పక్రియను పూర్తి చేస్తామని కమిషన్ ప్రకటించింది. గురువారం గ్రూప్-3 'కీ' విడుదల చేయనుంది. రెండ్రోజుల్లో గ్రూప్-2 'కీ' విడుదల చేయనున్నట్టు టీజీపీఎస్సీ తెలిపింది. షెడ్యూల్ ప్రకారం ఫలితాలు వచ్చేలా పనిచేస్తున్నామని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. ఈనెల 11, 12 తేదీల్లో బెంగళూరులో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల సదస్సు ఉంటుందని, ఉద్యోగ పరీక్షల విధానాలపై సదస్సులో చర్చించనున్నట్టు చెప్పారు.

# రోడ్డెక్కిన విద్యార్థులు

- బస్సు కోసం మంబాపూర్ రోడ్డుపై ధర్నా
- జనగామ నుంచి బస్సు నడిపించాలని డిమాండ్
- డీఎంతో మాట్లాడి సమస్యను పరిష్కరించిన ఏఎంసీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి.



**పెద్దేముల్ జనవరి 8 (ప్రజాక్షేత్రం):**

తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండల పరిధిలోని మంబపూర్ లో విద్యార్థులు రోడ్డెక్కారు. మా గ్రామానికి బస్సు నడపాలని రోడ్డుపై బైటాయించారు.ఈ సంఘటన బుధవారం మంబాపూర్ లో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పెద్దేముల్ మండలం జనగామ గ్రామానికి వారం రోజుల నుంచి బస్సు రావడం లేదు. గ్రామం నుంచి మంబాపూర్, తాండూరు పాఠశాల, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో బుధవారం మంబాపూర్ రోడ్డుపై స్కూల్, కాలేజీ విద్యార్థులు బైటాయించి ఆందోళనకు దిగారు.సమయానికి బస్సులు లేక, ఆటోలలో వెళ్లలేక అవస్థలు పడుతున్నామని ఆవేధన వ్యక్తం చేశారు. విషయాన్ని ఆర్టీసీ డీపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించడం లేదని వాపోయారు. గ్రామానికి బస్సు నడిపించాలని డిమాండ్ చేశారు. సుమారు అరగంట పాటు విద్యార్థులు ఆందోళన చేపట్టడంతో తాండూరు %-% వికారాబాద్ మార్గంలో బస్సుల రాకపోకలకు అంతరాయంతో పాటు అటూ.. ఇటూ.. ట్రాఫిక్ జామ్ అయ్యింది.విషయం తెలుసుకున్న పెద్దేముల్ పోలీసులు సంఘటనా స్థలంకు చేరుకొని సముదాయించారు. ఈ క్రమంలో కోట్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి ఎమ్మెల్యేతో ఫోన్లో మాట్లాడారు.కాగా ఆర్టీసీ డీఎంతో మాట్లాడి బస్సు వేయిస్తామని చెప్పడంతో విద్యార్థులు శాంతించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు మైపూస్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామస్తులు.. పెంటప్ప, తదితరులు పాల్గొన్నారు.

## గొట్లపల్లి పల్లె ప్రకృతి వనంలో వృధాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

- నీరు వృధాగా పోతున్న పట్టించుకోని గ్రామపంచాయతీ కార్యదర్శి.



**పెద్దేముల్ జనవరి 8(ప్రజాక్షేత్రం):**

పెద్దేముల్ మండల పరిధిలోని గొట్లపల్లి పల్లెప్రకృతి వనంలో మిషన్ భగీరథ నీరు చెట్లకు పారకుండ వృధాగా పోతుంది. నీరువృధాగా పోతుందని గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు తెలియజేసిన తమకేమి తెలియ దనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఈ మేరకు నీరు వృధాగా పోకుండా పైపుకు ట్యాబు అమర్చాలని గ్రామస్తులు కోరుతున్నా రు.

## అయ్యప్ప స్వామి మహా పడిపూజ

- కోమటిరెడ్డి లక్ష్మి రాజగోపాల్ రెడ్డి



**నాంపల్లి జనవరి 08(ప్రజాక్షేత్రం)**

మండల కేంద్రంలోని అంగడి బజార్ వేణుగోపాల స్వామి దేవాలయం సన్నిధిలో గజ్జల అనంతలక్ష్మి కృష్ణారెడ్డి దంపతుల కుమారుడు జిల్లా కాంగ్రెస్ నాయకులు గజ్జల శివారెడ్డి నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న గౌరవ మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సతీమణి కోమటిరెడ్డి లక్ష్మి స్వామివారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించిన లక్ష్మీ రాజగోపాల్ రెడ్డి ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కత్తి రవీందర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి ఏవి రెడ్డి, జిల్లా నాయకులు పూల వెంకటయ్య మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు

## అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ ఫారూఖ్ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం నిర్వహణ



**పాల్వంచ,జనవరి08(ప్రజాక్షేత్రం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ మండలం, జగన్నాధపురం లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా బుధవారం అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ ఫారూఖ్ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.విద్యార్థులకు రోడ్లపై ఎలా ప్రవర్తించాలో, పాఠశాలకు వెళ్లే సమయంలో రోడ్డు భద్రత గురించి సూచనలను అందించారు. రహదారి చిహ్నాల ప్రాముఖ్యతను తెలియజేశా రు.రోడ్డు భద్రతా జాగ్రత్తల గురించి వివరించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి బాలు ఇతర ఉపాధ్యాయులు రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడింది అన్నట్లు

## ఓ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యొక్క పరిస్థితి నెలకొందన్నారు

**వికారాబాద్ జనవరి 08 (ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం పరిధిలోని చించల పేట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు బాత్రూములు లేక విద్యార్థినిలు నాన్న అవస్థలు పడుతున్నారని విద్యార్థిని






యొక్క తల్లిదండ్రులు ఆరోపించారు. ఉన్న బాత్రూంల ను కాంట్రాక్టు కూలగొట్టి నేటికి నిర్మించకపోవడంతో ఉపాధ్యాయులు నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. బాత్రూం సమస్య వల్ల యూరిన్ ఇన్ఫెక్షన్లు వచ్చి అనారోగ్య సమస్యలు తలెత్తిన కూడా అధికారులు ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు విద్యార్థినిల యొక్క తల్లిదండ్రులు ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు ఉపాధ్యాయులకు తగిన న్యాయం చేకూర్చి బాత్రూంలో నిర్మించాలని ఆరు బయటకు వెళ్లకుండా స్త్రీ యొక్క గౌరవాన్ని కాపాడాలని కోరారు.

### శ్రీ బ్రహ్మసూత్ర మరకత లింగాన్ని దర్శించుకున్న

## కర్ణాటక మాజీ సీఎం యడ్యూరప్ప మనవడు

**శంకర్ పల్లి జనవరి 08(ప్రజాక్షేత్రం):**

శంకర్ పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11వ శతాబ్దానికి చెందిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో బుధవారం కర్ణాటక మాజీ సీఎం యడ్యూరప్ప మనవడు అమేయ గ్రెగ్ గ్రూప్ అధినేత నిఖిల్ చంద్ర ముళ్ళపూడి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి, స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు సాయి శివప్రసాద్ ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు మాజీ సీఎం మనువడిని సన్మానించి, స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా నిఖిల్ చంద్ర మాట్లాడుతూ వెయ్యి ఏండ్ల క్రితం నాటి శివాలయంలో పూజలు




చేయడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో వై.టీ చౌదరి, సినీ నటి కారుణ్య చౌదరి, సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, వైస్ చైర్మన్ శేఖర్, కమిటీ సభ్యుడు హన్మంతు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పెద్దేముల్ మండలంలో భారీ అగ్ని ప్రమాదం

- రెండు ఎకరాల చెరుకు పంట దగ్ధం
- భారీగా ఆస్తి నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన
- ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని రైతుల విజ్ఞప్తి.



**పెద్దేముల్ జనవరి 8(ప్రజాక్షేత్రం):**

పెద్దేముల్ మండల పరిధిలోని బండమీదిపల్లి గ్రామంలోని ఓ రైతు పొలంలో బుధవారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రైతులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... బండమీదిపల్లి గ్రామానికి చెందిన బత్తెల్లి బాలప్ప, బత్తెల్లి సాయప్ప అనే ఇద్దరు రైతులు తమ దగ్గర ఉన్న ఐదు ఎకరాల పొలంలో చెరుకు పంటను సాగు చేశారు. ఈ క్రమంలో పంటను కోసేందుకు సిద్ధంగా ఉండగా.. ప్రమాదవశాత్తు తమ పొలంలో ఉన్న విద్యుత్ వైర్ల షార్ట్ సర్క్యూట్ కారణంగా, చెరుకు పంటలో నిప్పులు పడి చెరుకు పంటతో సహా డ్రిప్పు పైపు మొత్తం కాలి బూడిద అయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఘటన స్థలానికి చేరుకొని సుమారు 50 మందికిపైగా అక్కడ చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే పంట పూర్తిగా దగ్ధమైనట్లు వారు తెలిపారు. ఈ మేరకు సుమారు రూ.3 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగిందని బాధిత రైతులు వాపోయారు. కాగా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ స్పందించి తగినంత నష్టపరిహారం అందించాలని రైతులు.. బాలప్ప, సాయప్ప ప్రభుత్వాన్ని కోరారు.

### మా భూమి మాకు ఇప్పించండి అని

## దంపతుల ఆవేదన



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి జనవరి8(ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండలం మాదారం గ్రామానికి చెందిన కావలి నర్సిములు తండ్రి కిష్టయ్య,మా గ్రామానికి చెందిన గురజాడ దగ్గర నా యెక్క భూమి సర్వే నెంబర్,26అ/1/7, 6 గుంటల భూమిని గురజాడ మల్లయ్య దగ్గర మోటివేషన్ చేసి, 4 లక్షల రూపాయలు అప్పు తీసుకున్నాను,ఇట్టి అప్పు వాయిదా మల్లయ్య దగ్గర గడువు ముగిసింది, అయితే నా దగ్గర డబ్బులు లేక, దిక్కు తోచని స్థితిలో ఉండగా, నా భూమి పోతదేమో అని భయం తో, మా పెద్ద నాన్న కూతురు యగు, కావలి వరమ్మ, భర్త తులజారామ్, అనే వ్యక్తి దగ్గర, 7 లక్షల రూపాయలు అప్పు అడిగి పెద్దల సమక్షంలో తీసుకోవడం జరిగింది, ఇట్టి డబ్బులకు గ్యారంటీ ఏమిటి అని మా అక్క నన్ను ప్రశ్నించడం జరిగింది. దానికి బదులుగా నేను,గురజాడ మల్లయ్య పేరు మీద నేను రిజిస్ట్రేషన్ చేసిన భూమిని మా అక్క కావలి వరమ్మ పేరు మీద రిజిస్ట్రేషన్ పెద్దల సమక్షంలో చెయ్యడం జరిగింది. ఇట్టి విషయం లో పెద్దల సమక్షంలో ఒప్పంద పత్రం రాసుకుకోవడం జరిగింది. ఇట్టి డబ్బులకు వాయిదా కాలం సంవత్సరం, మిత్తి మూడు రూపాయల చొప్పున తీసుకున్నాను, ఇట్టి వాయిదా పూర్తి కాకముందే, నేను డబ్బులు ఇస్తానంటే తీసుకోకుండా,నా మీద నాపై నేను ఇబ్బందులకు గురి చేస్తున్నానని నాపై నవాబ్ పేట్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు ఇవ్వడం జరిగింది, పిర్యాదు ఇచ్చిన తరువాత నవాబ్ పేట్ ఎస్ ఐ సమక్షంలో ఇరువర్గాలనూ, మీరు చర్చించుకొని మా దగ్గరికి రండి అని ఎస్ ఐ సమాధానం ఇవ్వడం జరిగింది, ఇట్టి విషయం పై పెద్దల సమక్షంలో మాట్లాడడం జరిగింది. అందరి సమక్షంలో 10 రూపాయలు ఇస్తానని ఒప్పుకోవడం జరిగింది.నేను 10 లక్షల రూపాయలు ప్రయివేట్ వ్యక్తి దగ్గర తెచ్చుకొని మా అక్క యగు కావలి వరమ్మ కు ఇద్దామని రెడీ అయినాను, ఇంతలో మా అక్క యగు కావలి వరమ్మ, నాపై అబండాలు మోపి నేను ఆమెను వేడిస్తున్నానని నా పై అబండాలు మోపి, నవాబ్ పేట్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసింది, ఇట్టి విషయం లో న్యాయ విచారణ జరిపించి, నాకు తగిన న్యాయం చెయ్యాలని, ఈరోజు వికారాబాద్ ఆర్ %ఇ% బి రెస్ట్ హౌస్ లో, పత్రిక విలేకరుల సమావేశంలో, తన ఆవేదనను వ్యక్తం చెయ్యడం జరిగింది.

## తల్లి కూతురు సేఫ్

- కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు.



**పెద్దేముల్ జనవరి 8(ప్రజాక్షేత్రం):**

గత నెల 30వ తేదీన భార్య, కూతురు అదృశ్యమయ్యారని ఆత్కూర్ తాండ గ్రామానికి చెందిన కేతావత్ నరేష్ పెద్దేముల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన విషయం విధితమే.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ముమ్మరం చేశారు. దర్యాప్తులో భాగంగా, పోలీసులు తమ యొక్క సాంకేతిక పరిజ్ఞానంతో, అదృశ్యమైన తల్లి, కూతురి ఆచూకీ హైదరాబాదులో ఉన్నట్లు గుర్తించి, సురక్షితంగా పోలీస్ స్టేషన్ తీసుకువచ్చారు. అనంతరం ఇట్టి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలుపగా, కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ ఆశ్రయించారు.కాగా అదృశ్యమైన తల్లి బిడ్డలు ఇరువురిని సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించడం జరిగిందని ఎస్ఐ శ్రీధర్ రెడ్డి వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఎస్సై శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. కుటుంబ కలహాల కారణంగానే మనస్థాపం చెంది, కూతురితో సహా తాను హైదరాబాద్ వెళ్లినట్లు స్పష్టం చేశారు.

## శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌ను అభినందించిన జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్



**శంకర్ పల్లి జనవరి 08(ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ శంకర్ పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ను అభినందించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ ను, కమిషనర్ మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణ పరిధిలో ఈనెల 4,5 వ తేదీలలో జరిగిన ముస్లిం మైనార్టీల ఇస్తేమా కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకుగాను అదనపు కలెక్టర్, కమిషనర్ ను అభినందించారు. రానున్న రోజులలో పట్టణంలో మంచి కార్యక్రమాలను చేయాలని కలెక్టర్ సూచించినట్లు కమిషనర్ తెలియజేశారు.

## ఇంటి ముందు రోడ్డుపై చెత్త వేయకండి

- ప్రజలకు కమిషనర్ సూచన



**శంకర్ పల్లి జనవరి 08(ప్రజాక్షేత్రం):**

ప్రతి ఒక్కరు ఇంటి ముందు రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకండని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని 15వ వార్డులో కమిషనర్ ఇంటింటికి తిరుగుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. మున్సిపాల్టీ నుండి వచ్చే ఆటోలలోనే చెత్తను వేయాలని కోరారు. ప్రజలు రోగాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.

## శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఏడవ వార్డులో ప్రధాన మురికి కాలువలో మట్టి పేరుకుపోవడంతో పక్కదారి పడుతున్న మురికి నీరు

**శంకర్ పల్లి జనవరి 08(ప్రజాక్షేత్రం)**



శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని ఏడో వార్డులో గల ప్రధాన మురికి కాలువలో ఇసుక మట్టి నిండుగా పేరుకుపోవడంతో మురికి నీరు ఇండ్ల ముందు మడుగు లా చేరడంతో ఆ కాలనీ వాసు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శంకర్‌పల్లి పట్టణంలోని 25 శాతం మురికి నీరు ఈ ప్రధాన కాలువ ద్వారానే గొల్లవాగు నదిలోకి వెళుతుంది. వర్షాకాలంలో మురికి కాలువ నిండా నీరు పారుతుంది. కాలువలో ఇసుక మట్టి నిండడంతో వర్షపు నీరు ఇళ్ళ ముందు చేరుకుంటుంది. మురికి కాలువలో ఉన్న మట్టిని తీసివేయాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు తెలిపిన పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ప్రధాన కాలువలు నిండిన ఇసుక మట్టిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

## రక్తదానం రికార్డు బద్దలు

- ఘనంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి జన్మదిన వేడుకలు
- 559 యూనిట్ల రక్తం ఇచ్చి అభిమానం చాటుకున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు
- రక్త దానం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే మేఘారెడ్డి



**వనపర్తి జనవరి 8(ప్రజాక్షేత్రం):**

వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం వేకువ జాము నుంచే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వనపర్తి తిరుమల హిల్స్ లోని ఎమ్మెల్యే నివాసానికి వందలాదిగా అభిమానులు చేరుకొని పుష్పగుచ్చాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి దంపతులు చేయూత ఆశ్రమంలో అనాథ పిల్లలతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఆ తర్వాత ఖిల్లా గణపురం మండలంలోని గట్టు కాడిపల్లి వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వివిధ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి పేద విద్యార్థులతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అలాగే మార్కెట్ యార్డులో చైర్మన్ బండారు శ్రీనివాస గౌడ్ నేతృత్వంలో మార్కెట్ కమిటీ సిబ్బంది, వ్యాపారులు, రైతులు, దడవాయిలు, హమాలీలతో కలిసి కేక్ కోసి వేడుకలు జరిపారు.ఆ తర్వాత ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరానికి నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ చందర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వాకిటి ఆదిత్య ల నేతృత్వంలో వనపర్తి పట్టణం తో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన యువత 559 యూనిట్ల రక్తాన్ని ఇచ్చి రికార్డు బద్దలు కొట్టారు. మునుపెన్నడూ లేని విధంగా మొట్టమొదటిసారిగా ఇంత పెద్ద మొత్తంలో రక్తదానం చేయడం ఇదే తొలిసారి అని రక్త సేకరణ చేసే ఆర్గనైజేషన్లు తెలిపాయి.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- చేవెళ్ల మండలం ముడిమ్యాల్ నుండి మేడిపల్లి వరకు రూ 24 కోట్లతో అభివృద్ధి.
- గోని సరితప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో రోడ్డుకు శంకుస్థాపన చేసిన రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి .
- చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య ఆధ్వర్యంలో టిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి 100కి పైగా చేరికలు.
- తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్,శాసనమండలి చీఫ్ విప్ శ్రీ పట్నం మహేందర్ రెడ్డి.
- చేవెళ్ల మాజీ పార్లమెంట్ సభ్యులు గడ్డం రంజిత్ రెడ్డి.
- చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పామన భీం భారత్.





**చేవెళ్ల జనవరి 08(ప్రజాక్షేత్రం):**

చేవెళ్ల మండలంలోని పలు శంకుస్థాపనకు ముఖ్యఅతిథిగా రోడ్లు భావన శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన సభలో స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ కోమటిరెడ్డి వెంకటరెడ్డి భోళా శంకరుడు ఏమి అడిగినా కాదనకుండా ఇస్తాడు. మా వికారాబాద్ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ. 150 కోట్లు మంజూరు చేశారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి సుపరిచితులు వికారాబాద్ నియోజకవర్గం నుండి వెళ్ళుతున్న నాలుగు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించి పదివేల కోట్లతో అభివృద్ధి చేయాలని కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. గత ప్రభుత్వం పదేళ్ళ పాలనలో రంగారెడ్డి జిల్లాలో రోడ్ల అభివృద్ధి జరగలేదు. ప్రజా ప్రభుత్వం వచ్చాకే ఇప్పుడు కావలసినన్ని నిధులు వస్తున్నాయి. చేవెళ్ల రాజకీయంగాచైతన్యవంతమైన నియోజకవర్గం కొండా వెంకట రంగారెడ్డి, ఇంద్రారెడ్డి వంటి రాజకీయ ఉద్దండులు ప్రాతినిధ్యం వహించిన ప్రాంతం ఇది మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ రాజశేఖరరెడ్డి తను ఏ పని ప్రారంభించినా చేవెళ్ల సెంటిమెంట్ గా ఇక్కడి నుండి ప్రారంభించేవారు. నాడు వైయస్ రాజశేఖర రెడ్డి హయంలో నిర్మించిన ఔటర్ రింగ్ రోడ్డు తోనే రంగారెడ్డి జిల్లాలో అభివృద్ధి పరుగులు మొదలయ్యాయి. శంషాబాద్ విమానాశ్రయం నిర్మాణంతో ఈ ప్రాంతంలోని భూములకు మంచి ధరలు వచ్చాయి రియల్ ఎస్టేట్ కూడా పెరిగింది. ఈ అభివృద్ధి అంతా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం లోనే జరిగింది. గత ప్రభుత్వం పదేళ్ళలో చేసింది ఏమి లేదు, రూపాయి పని చేసి వంద రూపాయల ప్రచారం చేసుకున్నారు, అంతా డొల్లనే, ఇప్పుడు చూస్తే అన్ని అప్పులే తప్పు చేసి బయటపడితే సిగ్గుపడాల్సింది పోయి దభాయిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ సమర్ధవంతంగా పనిచేస్తున్నది. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, ఆరోగ్య శ్రీ పది లక్షలకు పెంపు అమలవుతున్నాయి. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదిలో ఒక్క వ్యవసాయ రంగానికే యాబై నాలుగు వేల కోట్ల రూపాయల నిధులను ఖర్చు చేసింది. భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్రం చేయని విదంగా ఇరవై అయిదు లక్షల మంది రైతులకు ఇరవై ఒక్క వేల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేసింది. గత ప్రభుత్వ ముఖ్యమంత్రి లక్ష రూపాయల వరకు రుణాలను మాఫీ చేయడం కూడా కుదరదు అని చెప్పాడు. కాని దమ్మున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల వరకు రుణాలను మాఫీ చేసి మాటలు కాదు చేతల ముఖ్యమంత్రిని అని నిరూపించుకున్నాడు. ఇచ్చిన మాట ప్రకారం సన్న వడ్లకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇస్తున్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రజా ప్రభుత్వం జనవరి 26 గణతంత్ర దినోత్సవం నుండి రైతులకు రైతు భరోసా అందుతుంది. ఎకరాకు ఏడాదికి 12 వేల రూపాయలు ఇస్తారు. ఎకరాకు 15 వేలు అని చెప్పి 12వేలు ఇస్తారా అని ప్రతిపక్ష నాయకులు విమర్శిస్తున్నారు. అయ్యా మీరు చేసిన ఏడు లక్షల కోట్ల అప్పులకు మిత్తీలు కట్టడానికే రాష్ట్ర బడ్జెట్ లో సగం పోతుంది. ఆ అప్పే లేకపోతే హామీ ఇచ్చిన దానికంటే ఇంకా ఎక్కువగానే ఇచ్చేది ఈ ప్రభుత్వం రైతులకు సహాయం చేయాలని మనసులో ఉన్నా బడ్టేట్ ను చూసుకుని జాగ్రత్తగా నిధులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉన్నది. ఇప్పుడిప్పుడే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కుదుటపడుతుంది. పరిస్థితి మెరుగయ్యాక మళ్ళీ పెంచుతారు. మీ హయంలో కొండలకు, గుట్టలకు, రోడ్లకు, రియల్ ఎస్టేట్ వెంచర్ లకు కూడా రైతు బంధు ఇచ్చి 25వేల 672 కోట్లు దోచి పెట్టారు. మీలా వృధా చేయకూడదు నిజంగా కష్టపడే రైతులకు భరోసా అందచేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయం. అదేవిదంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం భూమి లేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఏడాదికి 12వేల రూపాయల సాయం అందుతుంది. గత ప్రభుత్వంలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు, ప్రజా ప్రభుత్వం వచ్చాకే పరీక్షలు నిర్వహించి నియామక ఉత్తర్వులు ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజల సంక్షేమం కోసం కష్టపడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మనమందరం అండగా నిలబడాలి. చేవెళ్ళ శాసనసభ్యులు కాలె యాదయ్య ఆధ్వర్యంలో రావులపల్లికి చెందిన మాజీ సర్పంచ్ కేసారం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బాలరాజు, దాదాపు 100 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చల్ల నరసింహారెడ్డి, చేవెళ్ల సర్పంచ్ శైలజ ఆగిరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ దేవర సమంతా వెంకటరెడ్డి, టేకులపల్లి శ్రీనివాస్, గంగి యాదయ్య, సీనియర్ నాయకులు వెంకటస్వామి, పడాల ప్రభాకర్, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సిపిఐ 100 వసంతాల ఉత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలి

- జనవరి 28న జరిగే సిపిఐ సమావేశాన్ని విజయవంతం చేయండి
- సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



**చేవెళ్ల, జనవరి 08 (ప్రజాక్షేత్రం):**

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 వసంతాల ఉత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని సిపిఐ సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య పిలుపునిచ్చారు. బుధవారం నాడు చేవెళ్ల పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ భవన్ లో సిపిఐ చేవెళ్ల నియోజకవర్గం కార్యదర్శి కె రామస్వామి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ 100 సంవత్సరాల చరిత్ర దానికి సంబంధించిన పోస్టర్స్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ భారత దేశంలో 1925 డిసెంబర్ 26న కాన్పూర్ నగరంలో ఏర్పడింది 2024 డిసెంబర్ 26 తో 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100 వసంతాలలోకి అడుగుపెడుతున్న కమ్యూనిస్టు పార్టీ చరిత్రను ప్రజలకు వివరించడానికి ప్రతి సిపిఐ కార్యకర్త ప్రచారం నిర్వహించాలని ఆయన తెలిపారు.జిల్లాలో చేవెళ్ల మరియు ఎల్బీనగర్ ప్రాంతాలలో భారీ బహిరంగ సభలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు వీటితోపాటు జిల్లాలోని అన్ని మండలా కేంద్రాలలో సభ లు ప్రదర్శనలు నిర్వహించాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తికై జరిగిన పోరాటం తెలంగాణ సాయుధ రైతంగ పోరాటం మరియు తెలంగాణ మలిదశ ఉద్యమంలో సిపిఐ పార్టీ పోరాటం మరువ లేనిదే అని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు సిపిఐ జిల్లా రైతు సంఘం కార్యదర్శి ప్రభు లింగం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ సిపిఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి మొయినాబాద్ మండల కార్యదర్శి కే శ్రీనివాస్ శంకర్ పల్లి మండల కార్యదర్శి పి సుధీర్ షాబాద్ మండల కార్యదర్శి నక్కల జంగయ్య ఏ కేస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్ గౌడ్, మంజుల బి కే ఎం యు జిల్లా అధ్యక్షుడు జే అంజయ్య మండల ఏఐటీయూసీ అధ్యక్షులు శివ వెంకటయ్య మీనాక్షి వెంకటమ్మ జయమ్మ రాజు అంజిరెడ్డి సత్యనారాయణ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# యూటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**కాకినాడ,ప్రజాక్షేత్రం:**

యుటిఎఫ్ రాష్ట్ర నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ ఎన్నికయ్యారు. యుటిఎఫ్ 17వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక స్వర్ణోత్సవ మహాసభలు ఈనెల 5, 6, 7, 8 తేదీలలో కాకినాడలో పిఆర్ డిగ్రీ కాలేజ్ ఆవరణలో నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి 20 వేలకు పైగా యుటిఎఫ్ నాయకులు కార్యకర్తలు ఈ సభల్లో పాల్గొన్నారు. ఆఖరి రోజు బుధవారం నిర్వహించిన ప్రతినిధుల సభలో యుటిఎఫ్ రాష్ట్ర నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగం రక్షణే ధ్యేయంగా కదలాలని, దీనికోసం అంతా నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

దేశంలో, రాష్ట్రంలో విద్యారంగం ప్రపంచ బ్యాంకు కనుసన్నల్లో నడుస్తూ శరవేగంగా కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ జరుగుతుందన్నారు. దీని ఫలితంగా పేదలకు విద్య దూరమయ్యే ప్రమాదం ఏర్పడుతోందన్నారు. ఈ నేపథ్యంలో ? ఉపాధ్యాయులంతా నడుం బిగించాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ బడులను, ఉద్యోగ ఉపాధ్యాయులను పరిరక్షించుకోవడానికి భవిష్యత్తు ఉద్యమాలకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయులు సమైక్యంగా ఉండాలని కోరారు. పిల్లలను సాంకేతిక దృక్పథం వైపు నడిపించాలన్నారు. దేశ సమగ్రత, లౌకికతత్వం కాపాడుకోవడానికి శాయశక్తులా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇదిలావుంటే ఏపి యుటిఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా నల్లి విశ్వనాధ్ ఎన్నికయ్యారు. సఖినేటిపల్లి మండలానికి చెందిన విశ్వనాద్ యుటిఎఫ్ మండల కార్యదర్శిగా, అధ్యక్షుడుగా, జిల్లా కార్యదర్శిగా, యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం జిల్లా కార్యదర్శిగా, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా యుటిఎఫ్ కార్యదర్శిగా అనేక సేవలు అందించారు. ఇటీవల జరిగిన యుటిఎఫ్ రాష్ట్ర నూతన కార్యవర్గంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ బలోపేతంకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతరం యుటిఎఫ్ పని చేస్తుందన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్సలు

### - కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రకటన



న్యూఢిల్లీ,ప్రజాక్షేత్రం

కేంద్ర రోడ్డు రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కీలక పథకాన్ని ప్రకటించారు. రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులకు నగదు రహిత చికిత్సను అందించేందుకు ప్రత్యేక పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఎవరైనా రోడ్డు ప్రమాదంలో గాయపడితే చికిత్సకు అయ్యే ఖర్చులో గరిష్ఠంగా రూ.1.50 లక్షలు ఈ పథకం ద్వారా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. అయితే ఇది మొదటి ఏడు రోజుల చికిత్సకు అయ్యే బిల్లుకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రమాద ఘటన జరిగిన 24 గంటల్లోగా పోలీసులకు సమాచారాన్ని అందిస్తేనే ఈ స్కీం ద్వారా నగదు రహిత చికిత్సను పొందొచ్చని గడ్కరీ స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్నట్లు చెప్పారు. 2025 మార్చి నాటికి దేశవ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా హిట్ అండ్ రన్ కేసుల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియాను అందిస్తామని గడ్కరీ తెలిపారు. పలు రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులతో కేంద్ర మంత్రి గడ్కరీ మంగళవారం సమావేశమయ్యారు. సమావేశం అనంతరం ఢిల్లీలోని భారత్ మండపంలో మీడియాతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలకే తమ మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. 2024లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1.8 లక్షల మంది చనిపోయారని.. అందులో 30 వేల మంది హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్లే మరణించినట్లు తెలిపారు. మృతుల్లో 66 శాతం మంది 18 నుంచి 34 ఏండ్ల మధ్య వయస్సుగల వారే ఉండటం బాధాకర విషయమన్నారు. ఇక స్కూళ్లు, కాలేజీల్లో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల తప్పుల వల్ల 10,000 మంది పిల్లలు చనిపోయారని గడ్కరీ వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తులు వాహనాలు నడపడం వల్ల మూడు వేల మంది మరణించినట్లు తెలిపారు.

## కుంభమేళాకు శ్రీవారి కళ్యాణరథం

### - జెండా ఊపి ప్రారంభించిన ఛైర్మన్



తిరుమల,ప్రజాక్షేత్రం

తిరుమల శ్రీవారి ఆలయం వద్ద నుంచి ప్రయాగ్ రాజ్ కుంభమేళాకు శ్రీవారి కళ్యాణరథం బయలుదేరింది. కల్యాణ రథంకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు , అదనపు ఈవో వెంకయ్య చౌదరి జెండా ఊపి ప్రయాగ్‌రాజ్‌కు కళ్యాణరథాన్ని పంపారు. ఈ సందర్భంగా అదనపు ఈవో వెంకయ్య చౌదరి మాట్లాడుతూ మహా కుంభ మేళా నేపథ్యంలో యూపీలోని ప్రయాగ్ రాజ్‌లో 2.5 ఎకరాల్లో శ్రీవారి నమూన ఆలయాన్ని ఏర్పాటు చేశామని, ఈ నెల 13వ తేదీ నుండి ఫిబ్రవరి 26వ తేదీ వరకు భక్తులకు స్వామి వారీ దర్శనం కల్పిస్తామని అన్నారు. నమూనా ఆలయంలో స్వామి వారికీ నిత్య కైంకర్యాలు నిర్వహిస్తామని, జనవరి 18, 26, ఫిబ్రవరి 3,12వ తేదీల్లో శ్రీవారికీ ప్రత్యేక కళ్యాణోత్సవ సేవను నిర్వహిస్తామన్నారు. డిప్యుటేషన్‌పై 150 మంది సిబ్బందిని ప్రయాగ్‌లో నియమించామని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్వామి వారి దర్శనం కల్పిస్తామని ఈవో వెంకయ్య చౌదరి వెల్లడించారు.

## మహిళల శరీరంపై కామెంట్స్ చేస్తే అది లైంగిక వేధింపే : కేరళ హైకోర్టు

కొచ్చి,ప్రజాక్షేత్రం




మహిళల శరీరం నిర్మాణంపై ఎటువంటి వ్యాఖ్యలు చేసినా.. అది లైంగిక వేధింపు అవుతుందని కేరళ హైకోర్టు పేర్కొన్నది. జస్టిస్ ఏ బదరుద్దీన్ ఈ తీర్పును ఇచ్చారు. కేరళ విద్యుత్తు శాఖకు చెందిన ఓ మహిళా ఉద్యోగినిపై మరో ఉద్యోగి కామెంట్ చేశారు. దీంతో ఆమె లైంగిక వేధింపుల కేసు నమోదు చేసింది. ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ ఆ ఉద్యోగి కోర్టును ఆశ్రయించాడు. 2013 నుంచి ఆ ఉద్యోగి చాలా అసభ్యకరమైన భాషను వాడారని, 2017లో అభ్యంతరకరమైన మెసేజ్‌లు, వాయిస్ కాల్స్ చేసేవాడని ఆమె ఆరోపించింది. విద్యుత్తు శాఖకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. మహిళా ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఐపీసీలోని సెక్షన్ 354ఏ(లైంగిక వేధింపులు), 509(మహిళను కించపరచడం), సెక్షన్120(ఓ) కింద కేసు బుక్ చేశారు. కేరళ పోలీసు చట్టంలోని సెక్షన్ 120(ఓ) కింద కూడా ఆ ఉద్యోగి లైంగిక వేధింపు లకు పాల్పడినట్లు కోర్టు పేర్కొన్నది. అయితే కేవలం శరీర శౌష్టవం బాగుందని కామెంట్ చేసి నంత మాత్రానా.. తనపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారని, ఆకేసును కొట్టివేయాలని విద్యుత్తు శాఖ ఉద్యోగి కోర్టును ఆశ్రయించారు. కాల్స్, మెసేజ్‌లతో నిందిత వ్యక్తి లైంగిక వేధింపు ల కామెంట్స్ చేసినట్లు మహిళా ఉద్యోగి ఆరోపించింది. అయితే ఐపీసీలోని సెక్షన్ 354ఏ, 509తో పాటు సెక్షన్ 120 కేరళ పోలీసు చట్టం ప్రకారం నిందితుడిపై తగిన ఆధారాలు ఉన్నట్లు హైకోర్టు తెలిపింది.

# సిద్దిపేట బీఆర్ఎస్ శ్రేణుల్లో... పొంగులేటి గుబులు..

సిద్దిపేట జనవరి 08(ప్రజాక్షేత్రం):

సిద్దిపేట బీఆర్ఎస్ శ్రేణుల్లో పొంగులేటి గుబులు మొదలైంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మాదిరి సిద్దిపేట జిల్లాలోనూ భూ అక్రమాలు జరిగాయని, దర్యాప్తునకు ఆదేశించినట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించడంతో భూ ఆక్రమణ దారులు హడలి పోతున్నారు. దర్యాప్తులో ఎవరే వరి భూ బాగోతం బట్టబయలు అవుతుందో..? పరిస్థితి ఏంటీ..? అని ఆక్రమణలకు పాల్పడిన బీఆర్ఎస్ నాయకులు, నాడు ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరించిన అధికారులు సైతం వనికి పోతున్నారు. బీఆర్ఎస్ కీలక నేతలే టార్గెట్ గా గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాల పై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిన విషయం తెలిసిందే. రాజన్న సిరిసిల్ల జిల్లాలో భూ ఆక్రమణల పై అధికారులు కొరడ ఝుళిపిస్తున్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులు దూకుడు ప్రదర్శిస్తుండటంతో భూ ఆక్రమణ దారులు సంబంధిత పత్రాలను అధికారులకు అందజేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉంటే రాజన్న సిరిసిల్ల జిల్లాలో మాదిరి సిద్దిపేట జిల్లాలోనూ భూ అక్రమాలు జరిగాయని దర్యాప్తునకు ఆదేశించినట్లు ఇటీవల రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించడంతో జిల్లాలో ప్రకంపనలు సృష్టించింది.

### పీవోటీ, జీవో 59 కి తూట్లు..?

జిల్లాలో పీవోటీ చట్టానికి, జీవో 59 కి తూట్లు పొడుస్తూ అధికారం అడ్డు పట్టుకొని బీఆర్ఎస్ కీలక నేతలు పెద్ద ఎత్తున భూ ఆక్రమణలు పాల్పడరాని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించిన నేపథ్యంలో గులాబీ నేతల అక్రమాల పుట్ట బట్టబయలు అయ్యే అవకాశం ఉందని అధికార పార్టీ నాయకులు వ్యాఖ్యానిస్తుండటం కొసమెరుపు.

### ఆక్రమణ దారులు హడల్..

గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ ఆక్రమణల పై ప్రభుత్వ దృష్టి సారించడంతో ఆక్రమణ దారులు



హడలెత్తి పోతున్నారు. అధికారం అడ్డు పెట్టుకొని ప్రభుత్వ , అసైన్డ్ భూములను అడ్డగోలుగా ఆక్రమించుకున్న నాయకులు కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని భయపడుతున్నారు. ఇదిలా ఉంటే నాడు నాయకులకు అనుకూలంగా వ్యవహరించిన అధికారులు సైతం తలలు పట్టుకుంటున్నారు. ఏదీ ఏమైనప్పటికీ బీఆర్ఎస్ కీలక నాయకులు, వారి అనుచరులే టార్గెట్ గా అధికార పార్టీ ఎత్తుగడ ఏ మలుపు తీసుకుంటుందో తెలియాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే.

# ఎస్టీ కమిషన్ ఎదుటకు వెలిమల భూ వివాదం..

పటాన్ చెరు జనవరి 08(ప్రజాక్షేత్రం):

గత వారం రోజులుగా వరుసగా వివాదాస్పదమైన రామచంద్రాపురం మండలం వెలిమల గ్రామంలోని మిగులు భూముల ఇష్యూ వివాదం కేంద్ర ఎస్టీ కమిషన్ దృష్టికి చేరింది. ఏండ్లుగా గిరిజన రైతులు సాగు చేసుకుంటున్న భూముల్ని అన్యాయంగా బడా రియల్ వ్యాపారులకు కట్టబెట్టి రైతులను మోసం చేస్తున్న విషయం పై గతంలోనే స్థానికులు కేంద్ర ఎస్టీ కమిషన్ ఆశ్రయించారు. గత నవంబర్ లో ఈ వివాదం పై ఎస్టీ కమిషన్ బాధిత రైతులతో పాటు రెవెన్యూ అధికారులను ఢిల్లీ పిలిపించి విచారించింది. తిరిగి గత మంగళవారం సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ రెడ్డితో పాటు రామచంద్రపురం తహశీల్దార్ సంగ్రామ్ రెడ్డిని కేంద్ర ఎస్టీ కమిషన్ ఢిల్లీకి విచారణకు పిలిచింది. అక్కడ జరిగిన విచారణ వివరాలను బుధవారం వెలిమల గ్రామ మాజీ సర్పంచ్ రాజ్య మహిపాల్ గౌడ్ వివరాలను వెల్లడించారు. రామచంద్రపురం మండలం వెలిమల గ్రామ రెవెన్యూ పరిధిలోని 88 ఎకరాల బిల్లా దాకాల మిగులు భూములున్నాయని గత డెబ్భై, ఎనభై ఏళ్లుగా గిరిజన రైతులు సాగు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. అయితే ఈ భూముల పై కన్నేసిన బడా వ్యాపారులు నిత్యానంద రెడ్డి, కళ్యాణ్ రెడ్డి, విక్రమ్ కుమార్ రెడ్డి ఈ భూమిని తమ వశం చేసుకోవాలని స్కెచ్ వేశారన్నారు. ఈ బడా బాబులకు కొందరు రాజకీయ నేతల అండదండలు దొరకడంతో అన్యాయంగా తప్పుడు రిజిస్ట్రేషన్ లతో మిగులు భూములను కాజేశారని ఆరోపించారు. ఈ పూర్తి వ్యవహారాన్ని స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో కేంద్ర ఎస్టీ కమిషన్ ఆశ్రయించడం జరిగిందన్నారు. గత నవంబర్లో ఎస్టీ కమిషన్ ఎదుట అధికారులతో పాటు బాధితులు హాజరయ్యారని, ఆ సమయంలో ఎస్టీ కమిషన్ గిరిజన రైతులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించినా ఫలితం లేకపోయిందన్నారు. మళ్లీ జనవరి 7 మంగళవారం సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ రెడ్డి, రామచంద్రపురం తహసిల్దార్ సంగ్రామ్ రెడ్డిలతో పాటు బాధితులు, గ్రామస్తులు ఢిల్లీలో ఎస్టీ కమిషన్ ఎదుట హాజరయ్యారని వివరించారు.ఈ విచారణలో గిరిజన రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో బడా బాబులకు కొత్త పాసు పుస్తకాలను ఇష్యూ చేయడం పై హాజరైన అధికారులను ఎస్టీ కమిషన్ ప్రశ్నించగా ఉన్నతాధికారుల ఆదేశాలతోనే ఈ ప్రక్రియ పూర్తి చేసినట్లు కమిషన్ ఎదుట వివరించారన్నారు. అయితే ఈ తతంగం పై సీరియస్ అయిన ఎస్టీ కమిషన్ ఈ పూర్తి వ్యవహారం పై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్, సీసీఎల్ఏ కమిషనర్ వరకు బడా బాబులకు సహకరిస్తున్నారని కమిషన్ దృష్టికి బాధితులు తీసుకుని వెళ్లారు. ఈ వ్యవహారం పై సీరియస్ అయినా ఎస్టీ కమిషన్ తప్పు తేలితే జిల్లా కలెక్టర్ తో పాటు బాధ్యులైన అధికారుల పై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించిందన్నారు.

### భూముల్లోనే బైఠాయించిన రైతులు..

గత మంగళవారం నుంచి పోలీస్ పహార మధ్య వందలాది ప్రైవేట్ సైన్యంతో తాము ఏండ్లుగా సాగుచేసుకుని



జీవిస్తున్న భూముల్లో అక్రమంగా కొందరు బడాబాబులు చొరబడే ప్రయత్నం చేస్తున్నారని వెలిమల తండావాసులు ఆందోళన కొనసాగిస్తున్నారు. తమతండ్రులు తాతల కాలం నుంచి ఈ భూముల పైన ఆధారపడి బతుకుతున్నామని ఇప్పుడు కొందరు అధికారులు బడా వ్యాపారవేత్తలకు సహకరిస్తూ తమ భూముల్ని అన్యాయంగా వారి పేరు పైన రిజిస్ట్రేషన్ చేశారని మండిపడ్డారు. మంగళవారం జరుగుతున్న పనులను ఆపే ప్రయత్నం చేయగా నిర్దాక్షిణ్యంగా తమను పోలీసులు పక్కకు లాగి పడేశారని ఆరోపించారు.తమ భూములు తమకు దక్కేవరకు తమ పోరాటం ఆపబోమని, తమ ప్రాణాలు తీసి ఈ భూముల్ని లాక్కోవాలని కన్నీటి పర్యంతమయ్యారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ పైన కరుణ చూపి తమ భూముల్ని తమకు అప్పగించాలని వేడుకున్నారు.

### మా భూమిని లాక్కోవడం అన్యాయం : రమేష్ రైతు

మా తండ్రులు తాతల కాలం నుండి ఇదే భూముల్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు ఉన్నట్టుండి కొందరు వ్యాపారులు తమ భూములను లాక్కోవడం అన్యాయం. గతరెండేళ్ల కింద రెవెన్యూఅధికారులు తమకు పట్టాలు అందిస్తామని ప్రలోభాలకు గురిచేసి తమతోనే సర్వేనెంబర్ 424 చుట్టూ ఫెన్సింగ్ వేయించా రు. ఇప్పుడు తమను మోసం చేసి పక్కనున్న మిగులు భూమిని విక్రం రెడ్డి తోపాటు నిత్యానంద రెడ్డి, కళ్యాణ్ రెడ్డికి కట్టబెడుతున్నారు. మా భూములు మాకే దక్కాలి మా ప్రాణాలు పోయిన భూములను వదిలే ప్రసక్తే లేదు.

## హ్యాట్రిక్ విజయం కోసం ఆప్ కృషి

- ఆప్‌కు మద్దతు పలికిన మమతా బెనర్జీ
- ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు తెలిపిన కేజ్రీవాల్



న్యూఢిల్లీ,ప్రజాక్షేత్రం

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం కోసం తీవ్రం గా శ్రమిస్తోన్న ఆమ్ ఆద్మీ పార్టీకి తృణమూల్ కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. ఫిబ్రవరి 5న జరగనున్న అసెం బ్లీ ఎన్నికలకు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మద్దతు ప్రకటించినట్లు ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'థాంక్యూ దీదీ' అంటూ'ఎక్స్'లో పోస్టు పెట్టారు. 'ఢిల్లీ ఎన్నికల్లో ఆప్‌నకు తృణమూల్ కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. మమత దీదీకి వ్యక్తిగతంగా కృతజ్ఞతలు తెలుపుతున్నా. థాంక్యూ దీదీ. మా మంచి చెడుల్లో మీరు ఎల్లప్పుడూ అండగా నిలిచారు' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. తాజా పరిణామంతో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌నకు మద్దతుగా నిలిచిన 'ఇండియా' కూటమి మిత్రపక్షాల జాబితాలో తాజాగా ఆప్ చేరడం గమనార్హం. గతంలో సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (యూబీటీ) కేజ్రీవాల్‌కు మద్దతు ప్రకటించా యి. గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న ఆప్.. ఆ తర్వాత జరిగిన హరియాణా ఎన్నికల్లో ఒంటరి పోరాటం చేసిన విషయం తెలిసిందే. ఢిల్లీలో మత్తం 70 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. 2015లో 67 స్థానాలు గెలుచుకొని తొలిసారి అధికారంలోకి వచ్చిన ఆప్.. ఆ తర్వాత 2020లో 62 సీట్లతో అధికారం నిలబెట్టుకుని ఇప్పుడు హ్యాట్రిక్ విజయం కోసం కృషిచేస్తోంది.

## కేరళ ఉత్సవాల్లో అపశృతి

- ఏనుగు బీభత్సం...
- 17 మందికి గాయాలు



తిరువనంతపురం, ప్రజాక్షేత్రం

కేరళ రాష్ట్రంలో నిర్వహించిన ఉత్సవాల్లో అపశృతి చోటు చేసుకుంది. ఉత్సవాల కోసం తీసుకొచ్చిన ఏనుగుల్లో ఒకటి జనాలపైకి దూసుకెళ్లి బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో 17 మంది గాయపడ్డారు. బుధవారం తెల్లవారు జామున 12:30 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసు కుంది. వివరాల్లోకి వెళితే.. మలప్పురంలోని బీపీ అంగడి వద్ద మంగళవారం రాత్రి వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఏనుగులను తీసుకొచ్చారు. ఉత్సవాలు జరుగుతుండగా.. ఉన్నట్టుండి ఓ ఏనుగు బీభత్సం సృష్టించింది. పెద్ద పెద్దగా శబ్దాలు చేస్తూ.. జనాల్లోకి దూసుకెళ్లింది. ఓ వ్యక్తిని తొండంతో ఎత్తి పక్కకు పడేసింది. ఈ ఘటనలో సదరు వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు తెలిసింది. ప్రస్తుతం అతడికి కొట్టకల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా, ఏనుగు ఒక్కసారిగా బీభత్సం సృష్టించడంతో జాతరకు వచ్చిన ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఏనుగు దాడి నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీశారు. ఈ క్రమంలో అక్కడ తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో సుమారు 17 మందికిపైగా గాయపడినట్లు స్థానిక అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని ఏనుగును బంధించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు.

## పుష్పలో అదనపు సన్నివేశాల విడుదల

హైదరాబాద్,ప్రజాక్షేత్రం

కొన్ని అదనపు సన్నివేశాలతో కూడిన 'పుష్ప 2' రీలోడెడ్ వెర్షన్‌ను విడుదల చేయాల్సి ఉన్నా...అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్టు చిత్ర బృందం వెల్లడించింది. సంబంధిత కంటెంట్ విషయంలో సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమవుతోందని తెలిపింది. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది. ఈ నెల 17 నుంచి కొత్త సన్నివేశాలతో కూడిన సినిమాని చూడొచ్చని పేర్కొంది. ప్రస్తుతం థియేటర్లలో ప్రదర్శితమవుతున్న చిత్రానికి అద నంగా 20 నిమిషాల నిడివి గల సన్నివేశాలను జోడి స్తు న్నామని, ఈ నెల 11 నుంచి చూడొచ్చని మంగళవారం ప్రకటన వెలువడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 'పుష్ప 2' నిడివి 3 గంటల 20 నిమిషాల 38 సెకన్లు ఉండగా.. దానికి ఇంకా 20 నిమిషాల సీన్స్ యాడ్ చేస్తే, 3 గంటల 40 నిమిషాలు దాటిపోతుంది. అంటే ఇంటర్వెల్‌తో కలిపి దాదాపు 4 గంటల పాటు 'పుష్ప' ప్రపంచంలో ప్రేక్షకుడు ఉంటాడు. మరోవైపు, ఈ చిత్రం ఇప్పటికే సరికొత్త రికార్డులను క్రియేట్ చేసింది. రూ.1000 కోట్లకుపైగా వసూళ్లు సాధించిన భారతీయ చిత్రాల జాబితాలో రెండో స్థానంలో, తెలుగు సినిమాల లిస్ట్‌లో ప్రథమ స్థానంలోకి వచ్చింది. 'దంగల్' (రూ. 2 వేల కోట్ల కుపైగా) తర్వాత ఇప్పటి వరకూ రెండో ప్లేస్‌లో ఉన్న 'బాహుబలి 2' (రూ. 1810 కోట్లు)ను రికార్డును బ్రేక్ చేసింది.